క్లుప్తంగా

ఘనంగా ఎంజీఆర్ జయంతి


ఎంజీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

నగరి : తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంజీ రామచంద్రన్ 106వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏఐఏడీఎంకే ఏపీ కార్యదర్శి ఆంబ్రోస్ విల్సన్ ఆధ్వర్యంలో పుదుపేట, ఏకాంబరకుప్పం, చింతలపట్టెడ, సత్రవాడ, కేవీపీఆర్‌పేట ప్రాంతాల్లో ఎంజీఆర్ చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నేతలు బృందా కన్నాయిరం, గోవిందస్వామి, పాండు, కేసీ షణ్ముగం, కైలాసం, బీఆర్‌వీ అయ్యప్పన్, నటరాజన్, మోహన్ రాజ్, మనోహర్, జహంగీర్‌భాయ్, దీపన్, దీపక్, సురేష్ పాల్గొన్నారు.

ఆరేటమ్మకు ప్రత్యేక అభిషేకం


ఆరేటమ్మ ఆలయం వద్ద అన్నదానం

పుత్తూరు రూరల్: పట్టణంలోని ఆరేటమ్మ ఆలయంలో మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. కొండచుట్టును పురస్కరించుకుని మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. కల్యాణపురం గ్రామానికి చెందిన జి.మునిరత్నం, నీలమ్మ, ప్రసాద్, లక్ష్మీ దంపతులు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కె.మనోహర్‌రెడ్డి పర్యవేక్షించారు.

తాగునీటి పైపులైను ఏర్పాటు


చిల్లామాకులపల్లి ఎస్టీకాలనీకి వేస్తున్న పైపులైను

శ్రీరంగరాజపురం : గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకే ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వైఎస్సార్‌సీపీ యువత అధ్యక్షుడు చిట్టిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిల్లామాకులపల్లిలో కొత్తగా తాగునీటి బోరు వేశామని, అక్కడి నుంచి చిల్లామాకులపల్లి ఎస్టీ కాలనీ వరకు ముందస్తు చర్యల్లో భాగంగా తాగునీటి పైపులైను వేశామన్నారు. అలాగే పంచాయతీకి మరో రెండు తాగునీటి బోర్లను డిప్యూటీ సీఎం నారాయణస్వామి మంజూరు చేయించారని చెప్పారు. గ్రామాల్లో శాశ్వత ప్రాతిపదికన తాగునీటి సమస్య తీరుస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామికి గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి


దుప్పిని ఖననం చేస్తున్న అటవీశాఖ అధికారులు

కార్వేటినగరం: కుక్కల దాడిలో దుప్పి మృతి చెందిన సంఘటన మండలంలోని రాజుబావు పల్లా వద్ద మంగళవారం చోటు చేసుకుంది. అటవీశాఖ అధికారి చంద్రశేఖర్ కథనం మేరకు వివరాలిలా.. వెదురుకుప్పం మండలం, రామచంద్రాపురం మండల సరిహద్దు ప్రాతమైన రాజుబావి పల్లా(రాజానగర్) అటవీ ప్రాంతం నుంచి నీటి కోసం వచ్చిన దుప్పిపై కుక్కలు దాడి చేశాయని, దీంతో తీవ్రంగా గాయపడిన దుప్పి మృతి చెందిందని తెలిపారు. అనంతరం దుప్పి కళేబరాన్ని కార్వేటినగరం అటవీశాఖ పరిధిలోని కుప్పానిగుంటకు తరలించి పంచనామా నిర్వహించి ఖననం చేశామన్నారు. కార్యక్రమంలో రామచంద్రాపురం ఏరియా బీటీ అధికారి అరుణ, సిబ్బంది ఉన్నారు.

కార్మికులకు దుస్తుల అందజేత


దుస్తులు అందిస్తున్న సర్పంచ్ వసంతమ్మ

నింద్ర: పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు సర్పంచ్ వసంతమ్మ మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. ఆమె మట్లాడుతూ పల్లెకు సేవలందించే కార్మికులకు దుస్తులు అందించడం తృప్తిగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు శివలింగంఆచారి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

విస్తృతంగా ఫ్యామిలీ డాక్టర్ సేవలు

గంగాధరనెల్లూరు: మండలంలోని మహదేవ మంగళం, పాచిగంట గ్రామాల్లో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తూగుండ్రం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ధీర్ఘకాలిక రోగులతో మాట్లాడి వైద్యం అందించారు. తీవ్రమైన జబ్బులకు ఆరోగ్యశ్రీ ద్వారా రెఫర్ చేశారు. ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్ గర్భిణుకు, బాలింతలకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు.

సంక్రాంతి సంబరాలు.. రమణీయంగా రంగవల్లులు


విజేతలతో మంత్రి ఆర్కేరోజా, అలీ తదితరులు

- వైభవంగా సాంస్కృతిక కార్యక్రమాలు
- సంప్రదాయం ప్రతిబింబించేలా వినూత్న పోటీలు
- ఆర్‌కే రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బహుమతులు

నగరి : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆర్‌కే రోజా చారిటబుల్ ట్రస్ట్ వారు మంగళవారం వివిధ పోటీలు నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయాలను అద్దం పట్టేలా సంక్రాంతి సంబరాలు, ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మామిడి తోరణాలు, అరటి చెట్లు, చెరుకు గడలు, పొంగలి కుండలతో మైదానాన్ని విశేషంగా అలంకరించారు. సుమారు 377 మంది మహిళలు కనువిందుగా రంగవల్లులు తీర్చిదిద్దారు. ఈ క్రమంలోనే చిన్నారుల కోలాటాలు, భరత నాట్యాలు, డూడూ బసవన్న విన్యాసాలు, చిలకమ్మ జోస్యాలు, పతంగుల పోటీలు ఆకట్టుకున్నాయి. మెప్మా బజార్‌లో ఏర్పాటు చేసిన తెలుగింటి పిండి వంటలు నోరూరించాయి.

విజేతలకు బహుమతులు

పట్టణంలోనే తొలిసారి భారీస్థాయిలో నిర్వహించిన ముగ్గుల పోటీ విశేషంగా ఆకట్టుకుంది. నగరికి చెందిన విద్యాకుమారి ప్రథమ బహుమతిగా రిఫ్రిజిరేటర్‌ను గెలుచుకుంది. కొత్తపేటకు చెందిన తేన్‌మొళి రెండో బహుమతిగా వాషింగ్ మిషన్‌ను కైవసం చేసుకుంది. వీకేఆర్‌పురానికి చెందిన దివ్య మూడో బహుమతిగా 32 ఇంచీల టీవీని దక్కించుకుంది. మరో పది మంది స్టాండింగ్ ఫ్యాన్లను ప్రోత్సాహక బహుమతిగా అందుకున్నారు. అలాగే ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ మంత్రి ఆర్‌కే రోజా చేతుల మీదుగా చీర, గాజులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీ, స్విమ్స్ డైరెక్టర్ వెంగమాంబ, తుడా కార్యదర్శి లక్ష్మి, మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి, నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు పీజీ నీలమేఘం, హరి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మాహిన్, ఎంపీపీలు భార్గవి, దీప, మున్సిపల్ వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ వెంగమ్మకు గాజులు తొడుగుతున్న మంత్రి

అత్తాకోడళ్ల అనుబంధం

మంత్రి ఆర్‌కే రోజా కుటుంబ బంధాలకు ఎంతటి విలువ ఇస్తారో మరో పర్యాయం నిరూపితమైంది. ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించే కార్యక్రమంలో భాగంగా ఆర్‌కే సెల్వమణి తల్లి షణ్బగం పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి అత్తగారికి తినిపించారు. ఆమె చేతుల మీదుగా మహిళలకు చీరలు పంపిణీ చేయించారు. రాజకీయంగా తాను ఎంత బిజీగా ఉన్నా పిల్లలను కంటి రెప్పలా చూసుకుంటూ ప్రోత్సహించారని కొనియాడారు. అత్తాకోడళ్ల అనుబంధాన్ని ప్రత్యక్షంగా వీక్షించిన స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.


అత్తకు కేక్ తినిపిస్తున్న మంత్రి రోజా

శిలాఫలకాల జోలికి వస్తే ఉపేక్షించం


ధ్వంసమైన శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, పోలీసులు

శ్రీరంగరాజపురం : మండలంలోని విలాసవరహపురం పంచాయతీ ఆరిమాకులపల్లి వీజీపురం నుంచి పెద్దకొండేపల్లికి రూ.72 లక్షలతో ఇటీవల సీసీ రోడ్డు వేశారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా 2020 నవంబర్ 21వ తేదీన రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు పెద్దకొండేపల్లి గ్రామం వద్ద శిలాఫలకం ఏర్పాటు చేశారు. అయితే సోమవారం రాత్రి ఈ శిలాఫలకాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం పోలీసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గతేడాది సంక్రాంతి పండుగ నాడు కూడా ఇలాగే మండల కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన దివంగతనేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని కొంతమంది టీడీపీకి అనుకూలంగా ఉన్న యువకులు ధ్వంసం చేశారన్నారు. మళ్లీ ఇప్పుడు సంక్రాంతి నాడు శిలాఫలకాన్ని ధ్వంసం చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇలాంటి చిల్లర పనులు మానుకోకపోతే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ చర్యలకు పాల్పడిన వారు ఎవరైనా సరే ఉపేక్షించేది లేదన్నారు. ఇది స్థానిక టీడీపీ నేతల పనే అని, శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిని పోలీసులు కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, సర్పంచ్ లక్ష్మి, మాజీ సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు గురవా రెడ్డి, నాయకులు చంద్రనాయుడు, దామునాయుడు, గుణశేఖర్ నాయుడు, దామోదర్ ఆచారి పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం


మాట్లాడుతున్న పూర్వవిద్యార్థినులు

పాలసముద్రం : మండలంలోని అత్తిమ్మాంజేరిపేట ఉన్నత పాఠశాలలో 1998–2000 సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక మంగళవారం బలిజకండ్రిగ టీటీడీ కల్యాణ మండపంలో ఉత్సాహ భరితంగా జరిగింది. ఈ సందర్భంగా వారు అప్పట్లో విద్య నేర్పించిన గురువులు సురేంద్రబాబు, దేవసహాయం, మణి, ఎస్‌వీఆర్‌కు పాదపూజ చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. సమావేశంలో పూర్వ విద్యార్థులు వారి కుటుంబ వివరాలు ప్రస్తుతం వారు చేస్తున్న పనులను ప్రతి ఒక్కరూ వేదికపై చెప్పారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు సురేంద్రబాబు మాట్లాడుతూ తమ వద్ద విద్యను అభ్యసించిన 1998–2000 సంవత్సరంలో విద్యార్థులు ఇలా కలవడం చాలా ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగడంతో పాటు సమాజ సేవ చేసినప్పుడే గురువులకు చాలా సంతోషంగా ఉంటుందన్నారు.


సమావేశానికి హాజరైన పూర్వ విద్యార్థులు

టోర్నీ విజేత వీవీఆర్ పురం జట్టు


విజేత వీవీఆర్ పురం జట్టుతో నిర్వాహకులు

గంగాధరనెల్లూరు: మండలంలోని బాలగంగనపల్లి పంచాయతీ మేనాటంపల్లి గ్రామంలో జరిగిన నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీల్లో ఎస్‌ఆర్‌పురం మండలం వీవీఆర్ పురం జట్టు విజేతగా నిలిచింది. రెడ్డీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 5 రోజులుగా నిర్వహించిన ఈ టోర్నీలో మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పాపిరెడ్డిపల్లి జట్టు వీవీఆర్ పురం జట్టు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో విజేతగా వీవీఆర్ పురం జట్టు నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. తాము గత ఏడేళ్లుగా పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం నిర్వాహకులు రమేష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, చిరంజీవిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, నగేష్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి, రూప్‌చంద్రారెడ్డి విజేత జట్టుకు రూ.లక్ష మొదటి బహుమతిగా ప్రదానం చేశారు. రెండో బహుమతి కింద పాపిరెడ్డిపల్లి జట్టుకు రూ.50 రూపాయలు నగదును అందజేశారు.

మంత్రి రోజా పర్యటన నేడు

నగరి : నియోజకవర్గంలో మంత్రి ఆర్‌కే రోజా బుధవారం పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు మండలంలోని మూలానత్తంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు భూమి పూజ చేయనున్నారు. పట్టణంలో పునీత్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ప్రారంభించనున్నారు. అనంతరం పుత్తూరు మండలం దిగువ తిరుమల కుప్పం దళితవాడలో పక్కా గృహాలకు రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సిమెంట్ బస్తాలను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. తిరుమల కుప్పం సచివాలయం పరిధిలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. వడమాలపేట మండలం బట్టి కండ్రిగ గ్రామం, ఏఎం పురం, నారాయణ పురం గ్రామాలకు చెందిన పక్కాఇళ్ల లబ్ధిదారులకు రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా సిమెంట్ బస్తాలను పంపిణీ చేయనున్నారు.

అంజేరమ్మకు ప్రత్యేక పూజలు


విశేషాలంకరణలో అంజేరమ్మ ఆలయం

వడమాలపేట : సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంగళవారం ఎస్వీ పురం పంచాయతీలోని అంజేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే వడమాలపేట, అప్పలాయిగుంట, వడమాలలోని ఆలయాల్లో విశేష పూజలు జరిపించారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు సత్కారం


విక్టర్ ప్రసాద్‌ను సన్మానిస్తున్న వెంకటేష్

వడమాలపేట : ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌ను ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు వెంకటేష్ సత్కరించారు. మంగళవారం తిరుపతిలోని పద్మావతి అతిథిగృహంలో ఆయనను కలిసి ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

హుండీ ఆదాయం రూ.3.29 లక్షలు


కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

శ్రీరంగరాజపురం: తయ్యూరు పాయకట్టులోని ఆరిమాకులపల్లెలో వెలసిన ఆరిమాను గంగమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.3,29,932 వచ్చినట్లు ఈఓ తిమ్మారెడ్డి తెలిపారు. మంగళవారం ఆలయ ఆవరణలో హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ కనుమ పండుగను పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారని చెప్పారు.

చింతపెంటలో గడపగడపకు రేపు

పెనుమూరు(కార్వేటినగరం) : పెనుమూరు మండలం చింతపెంట గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో మాట్లాడారు. చింతపెంట గ్రామంలో 19వ తేదీ గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం నుంచి లబ్ధిదారులకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి ఆరా తీస్తారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

దుస్తులు పంపిణీ

వెదురుకుప్పం: మండలంలోని నల్లవెంగనపల్లె దళితవాడలో మంగళవారం అరసు స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు కావలి రాజేంద్రన్ 25 మంది కూలీలకు దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సంస్థ తరఫున సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

వైభవంగా కొండచుట్టు


నగరి : మండపం వద్ద భక్తుల కోలాహలం

పెనుమూరు(కార్వేటినగరం) : మండలంలోని పులుగుండుపై వెలసిన శ్రీ పులిగింటేశ్వరస్వామి ఆలయం వద్ద కొండచుట్టు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామివారిని ప్రత్యేక వాహనంలో ప్రతిష్ఠించి పులిగుండు చుట్టూ మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటాలు, చెక్కభజనలతో గిరిప్రదక్షిణ చేపట్టారు.

ఆలత్తూరులో..

కార్వేటినగరం మండల పరిధిలోని ఆళత్తూరు గ్రామ సమీపంలో నిర్వహించిన కొండచుట్టు కార్యక్రమంలో భాగంగా వినాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు

నగరిలో..

నగరి : నగరి పట్టణంలో కొండచుట్టు ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం ఉదయం నుంచే కొండచుట్టు మండపం వద్ద హడావుడి మొదలైంది. పరిసర గ్రామాల నుంచి వచ్చే దేవతలకు ఆహ్వానం పలికేందుకు ముందుగా వెళ్లాల్సిన కరకంఠేశ్వర స్వామికి ఉదయం నుంచే ఆలయ అర్చకులు అభిషేక, అర్చనలు చేసి అలంకరణ ప్రారంభించారు. అలంకరణ ముగించిన తరువాత వచ్చే దేవతలకు స్వాగతం పలికేందుకు సాయంత్రం కొండచుట్టు మండపం వద్దకు తీసుకువెళ్లారు. సాయంత్రం మండపం వద్దకు దేవతామూర్తులు చేరుకోగా, భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో ఆ ప్రాంతమంతా సందడి వాతారవణం నెలకొంది.

భక్తిశ్రద్ధలతో కొండచుట్టు

నింద్ర: మండలంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతల కొండచుట్టు నిర్వహించారు. కర్పూరవేడు, నేట్టేరి, మేళంబాకం, చవరంబాకం, ఆలపాకం గ్రామ దేవతలను ప్రత్యేకంగా అలంకరించారు. దేవతలను ఊరేగిస్తూ కొండ ప్రదక్షిణ చేశారు.

పుత్తూరు రూరల్: మకర సంక్రాంతి సంబరాల్లో భాగంగా నాలుగో రోజు కొండచుట్టు కోలాహలంగా నిర్వహించారు. పట్టణంలోని కామాక్షి సమేత సదాశివేశ్వరస్వామి వార్ల ఆహ్వానం మేరకు చుట్టుపక్కల గ్రామాల నుంచి దేవతా మూర్తులను కొండచుట్టు మండపం వద్ద కొలువుదీర్చారు. ముందు కామాక్షీ సమేతంగా సదాశివేశ్వరుడు ఆశీనులు కాగా, అతిథులుగా విఘ్నేశ్వరుడు, రుక్మిణీ సత్యభామ సమేత కృష్ణుడు, ద్రౌపదీదేవి సమేత అర్జునుడు, సీతా సమేత శ్రీరాముడు, ఆంజనేయస్వామిని అధిష్ఠింపజేశారు. మున్సిపల్ చైర్మన్ హరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పండరి భజన అలరించింది.

వైభవంగా గిరి ప్రదక్షిణ

విజయపురం : మండలంలోని పన్నూరులో ఇష్టకామేశ్వరస్వామి, పన్నూరు–2 నుంచి శ్రీకృష్ణుడు, చిన్న ఆలపాకం నుంచి సీతారాములు స్వామి, కేఆర్ పాళెం నుంచి మహాలక్ష్మి అమ్మవారి గిరి ప్రదక్షిణ వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు కొండచుట్టులో పాల్గొన్నారు.


నగరి: మండపం వద్ద కొలువుదీరిన కరకంఠేశ్వరుడు


పుత్తూరు మున్సిపల్ చైర్మన్ హరి ఆధ్వర్యంలో పండరి భజన


పుత్తూరు మండపం వద్దకు వస్తున్న ఆంజనేయస్వామి


ప్రత్యేక అలంకరణలో పులిగుంటేశ్వరుడు


మండపం వద్దకు బయలుదేరుతున్న ద్రౌపదీ సమేత అర్జునుడు


పులిగుండు వద్ద భక్తుల జనసందోహం

దుమ్మురేపిన కోడెగిత్తలు


దూసుకుపోతున్న కోడెగిత్తలు


బ్రాహ్మణపల్లెలో జనసందోహం

వెదురుకుప్పం : సంక్రాంతి సంబరాల్లో భాగంగా చివరిరోజు పశువుల పండుగ గ్రామాల్లో కోలాహలంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో జరిగిన ఎడ్ల పందేలు హోరెత్తించాయి. యువత కేరింతలు.. మందుబాబుల అల్లర్లు.. ప్రేక్షకుల అరుపులు, కేకలతో మంగళవారం మండలంలోని కురివికుప్పం, బ్రాహ్మణపల్లెలో జరిగిన జల్లికట్టు దుమ్మురేపింది. ఈసందర్భంగా అభిమాన హీరోల చిత్రపటాలతో పాటు ఎడ్లకు పలకలు, వస్త్రాలు కట్టి పందేనికి సిద్ధం చేశారు. అప్పటికే చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున చేరుకున్న యువత పందేనికి తాము రెడీ అన్నట్లు అల్లి వద్ద నిలబడి కోడెగిత్తలను ఉసిగొల్పారు. దీంతో కోడెగిత్తలు రంకెలేసుకుంటూ జన ప్రవాహాన్ని చీల్చుకుంటూ దూసుకుపోయాయి. ఎద్దులను నిలువరించి పలకలు పట్టేందుకు యువత పోటీ పడ్డారు. పలకలను లాక్కొని తమ వీరత్వాన్ని చాటుకున్నారు. అయితే కొన్ని పోట్లగిత్తలు జన ప్రవాహాన్ని సైతం లెక్కచేయకుండా తమ ప్రతాపాన్ని చూపించాయి. కొన్నిచోట్ల యువకులు పశువుల దూకుడును కట్టడి చేయలేకపోయారు.

నాది..కాదు నాదే..

బ్రాహ్మణపల్లె, కురివికుప్పం గ్రామాల్లో జల్లికట్టు సందర్భంగా ఎడ్లను కట్టడి చేసే క్రమంలో ఇరువర్గాల వారు పోటీ పడ్డారు. నాదంటే నాది అంటూ పలకల కోసం పట్టుబట్టారు. వాటిని లాక్కొనే క్రమంలో ఒకరినొకరు తోసుకున్నారు.

గ్రామాల్లో సందడే సందడి..

బ్రాహ్మణపల్లె, కురివికుప్పం గ్రామాల్లో జరిగిన ఎడ్ల పందేలు కోలాహలంగా ముగిశాయి. సంక్రాంతి పర్వదినాల్లో నాలుగో రోజు గ్రామాల్లో పెద్దఎత్తున జల్లికట్టు నిర్వహిస్తారు. దీంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే వారితో గ్రామాలు జనంతో కిక్కిరిశాయి. ఈక్రమంలో ఎడ్లను పందేనికి వదులుతున్న సమయంలో యువకులు ఈలలు, అరుపులు వేసుకుంటూ ఎడ్లపై పడడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. నువ్వా-నేనా అంటూ పశువులపై ఎగబాకారు. గాయాలను సైతం లెక్కచేయకుండా యువకులు హుషారుగా పాల్గొన్నారు. పశువుల కింద పడి పలువురు గాయపడ్డారు. జల్లికట్టు ఉత్సవాన్ని తిలకించేందుకు జనాలు మిద్దెలు, చెట్లు ఎక్కారు. చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిశాయి.